క్లుప్తంగా

కల్లంలో ఆరబోసిన మిరపకాయలు చోరీ



ఫిరంగిపురం: కల్లంలో ఆరబోసిన మిరప కాయలు ఎత్తుకుపోయిన ఘటన మండలంలోని బేతపూడి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు పరస మహబూబ్ సుబానీ నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట వేశాడు. పంట కోసిన తర్వాత కాయలు పొలంలో ఆర బెట్టాడు. మంగళవారం ఉదయం కళ్లం వద్దకు వెళ్లేసరికి మిరప కాయలు తగ్గినట్లు గమనించాడు. సుమారు 18 క్వింటాళ్ల వరకు చోరీకి గురయ్యాయని గుర్తించాడు. దీనిపై ముప్పాళ్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ధర్నాను జయప్రదం చేయండి




తాడేపల్లిరూరల్ : ఆశ వర్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం గురువారం విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి నాయకులు సీహెచ్ సుగుణ, వేముల రేణుక పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రకాష్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ప్రధాన వైద్యులు డాక్టర్ మానస మంజరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసుకున్న ఒప్పందాలకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు రూ.2 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన వారందరికీ ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్యామల, భారతి, విజయలక్ష్మి, కెన్యా జ్యోతి, విజయలక్ష్మి, విశాలాక్షి పాల్గొన్నారు.

రహదారి పక్కన గుర్తుతెలియని మృతదేహం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారి పక్కనే మృతదేహం ఉందని స్థానికులు తాడేపల్లి పోలీసులకు మంగళవారం సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్‌ఐ ఖాజావలి మృతదేహాన్ని పరిశీలించగా, ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడి శరీరంపై బూడిద రంగు జీన్స్, భుజంపై తేలు బొమ్మ టాటూ, చాతిపై హిందీలో రాసి ఉందని, బహుశా వేరే రాష్ట్రం నుంచి పనిచేయడానికి వచ్చి ఇక్కడ మృతి చెందిన ఉంటాడని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆలపాటి గెలుపుతో సంబరాలు



తాడేపల్లిరూరల్ : కృష్ణా, గుంటూరు నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తాడేపల్లి టీడీపీ శ్రేణులు మంగళవారం ఆనందం శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లి పార్టీ కార్యాలయం వద్ద బాణ సంచా కాల్చి, సంబరాలు జరుపుకున్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ రాజకీయపరంగా ఎంతో అనుభవం ఉన్నవారని, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఆయా కార్యక్రమాల్లో శీర్ల లాల్ చంద్, కృష్ణ వందన, కోటేశ్వరరావు, నాగుల్, రంగారావు, సత్యనారాయణ, గోపి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ శాప్ కార్యాలయంలో మంగళవారం శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించి రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను విస్తరింపజేయాలని పేర్కొన్నారు. క్రీడాకారులు నగిడి గాయత్రి, డి.చేతన భగవతి, నగిడి రాజేష్ ఉన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలి అర్బన్: రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివ లింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. డాక్టర్ వీరమానునేని రఘురామ్ జ్ఞాపకార్థం బాలాజీ డెవలపర్స్ అధినేత పరుచూరి శ్రీనాథ్‌బాబు ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు.

కాటన్ కాలం

- చివరాఖరుకు శీతాకాలం
- రానే వచ్చేసిన వేసవికాలం
- కాటన్ వస్త్రాల కట్టుకు అనుకూలం
- ఉక్కపోతకు, ఎండ వేడిమి నుంచి ఉపశమనం
- మక్కువ చూపుతున్న యువత
- మంగళగిరి చేనేత వస్త్రాలకు పెరిగిన డిమాండ్

వేసవి రానే వచ్చేసింది. శీతాకాలం చివరాఖరుకు చేరింది. శివరాత్రికి శివశివ అంటూ చలి ఎగిరి పోయింది. భగభగ మంటూ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఇప్పటి దాకా ఉన్ని, టైట్ ఫిట్టింగ్ దుస్తులు ధరించిన ప్రజలు ఇక వేసవి రానుండడంతో కాటన్ వస్త్రాల వైపు చూస్తున్నారు. ఎక్కడెక్కడ మంచి కాటన్ వస్త్రాలు లభిస్తాయా అంటూ సామాజిక మాధ్యమాల్లో అన్వేషిస్తున్నారు.

తాడేపల్లిరూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే చాలామంది దుస్తుల ఎంపికపై శ్రద్ధ చూపుతున్నారు. మహిళలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు, ఇలా అన్ని వయస్సుల వారు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు కాటన్ దుస్తులు వైపు చూస్తున్నారు. అలాంటి వారు తెలుపు, ఇతర లేత రంగుల్లోని దుస్తులు ఎంచుకుంటే హాయిగా ఉంటాయి.

మంగళగిరి చేనేత ఘనత

గుంటూరు జిల్లాలోని మంగళగిరి చేనేత వస్త్ర పరిశ్రమకు పేరెన్నికగన్నది. ఇక్కడ ప్రత్యేక పద్ధతులతో పత్తి నుంచి వస్త్రాలను తయారు చేయడం తరాల నుంచి వస్తున్న ఆనవాయితీ. పత్తిలోని గింజలను తొలగించి వాటిలోని మలినాలను శుభ్రం చేసి ఏకుతారు. అలా ఏకిన పత్తిని స్థూపాకారంగా చుట్టి రాట్నం ఉపయోగించి పత్తి నుంచి దారం తీస్తారు. దారాల్లో గంజిని ఉపయోగించి గట్టిదనం వచ్చే వరకు సరిచేసి, మగ్గంతో వస్త్రాలు నేయడంలో మంగళగిరి



కొనుగోలుకు సిద్ధంగా ఉన్న చేనేత కాటన్ వస్త్రాలు

చేనేతలు సిద్ధ హస్తులు. 1980లో మంగళగిరి చేనేతకు స్వర్ణయుగం అని చెప్పాలి. అప్పటి నుంచి 2000 సంవత్సరం వరకు మంగళగిరి చేనేతకు ఢోకా లేకుండా పోయింది. మంగళగిరి చేనేత దుస్తులకు మంచి ఆదరణ ఉండడంతో ఇతర రాష్ట్రాల నుండి కూడా ఇక్కడికి వచ్చి శుభ కార్యాల కోసం దుస్తులు కొనుగోలు చేస్తారు. ఇప్పుడు వేసవి రావడంతో ఎక్కువగా కాటన్ దుస్తులు ధరించడం ప్రతి ఒక్కరు చేస్తున్న పని. అందులోనూ మంగళగిరి చేనేత వస్త్రాలంటే మక్కువ. దీంతో మంగళగిరి చేనేత వస్త్రాలకు ఈ వేసవికి డిమాండ్ బాగా పెరిగింది. మంగళగిరి నియోజకవర్గంలో అన్ని వయస్సుల వారి అభిరుచులకు తగ్గట్టుగా మోడళ్లు, రంగులు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపారులు కొనుగోలు దారులను ఆకట్టుకునేందుకు రకరకాల డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు.

చెమట సమస్యలకు చెక్

ఎండాకాలం వల్ల మన శరీరంలోంచి వెలువడే చెమటను కాటన్ క్లాత్ పీల్చుకుంటుంది. అప్పుడు అది గాలి తాకిడికి వెంటనే బయటకు వచ్చేస్తుంది. అన్ని వాతావరణాల్లోనూ మన శరీరాన్ని రక్షించే సత్తా కాటన్ వస్త్రాలకు ఉంది. వేసవిలో సింథటిక్, పాలిస్టర్ వంటి దుస్తులు మానేయడం మంచిది. ఈ కాలంలో అవి ధరిస్తే చర్మం దురదగా ఉంటుంది. కాటన్ చెమటను పీల్చి బయటకు పంపేయడం వల్ల చర్మ వ్యాధులు రావు.

వేసవిలో విక్రయాలు ఊపందుకున్నాయి



వేసవి కాలం మొదటవడం, ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు వేడిమిని తట్టుకునేందుకు చేనేత కాటన్ దుస్తులు ఎక్కువగా ధరిస్తారు. విక్రయాలు ఊపందుకున్నాయి. మంగళగిరి నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా కొనుగోలు కోసం ఇక్కడకు వస్తున్నారు. వేసవి వేడిమిని తట్టుకునేందుకు మా దగ్గర కాటన్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి.

– పి. శ్రీకాంత్,
చేనేత వస్త్ర దుకాణ యజమాని, మంగళగిరి

వేసవికి కాటన్ వస్త్రాలు మేలు



అన్ని రకాల కాటన్ వస్త్రాలు ముఖ్యంగా మంగళగిరి చేనేత కాటన్ దుస్తుల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మగవారికే కాకుండా, మహిళలు, యువతకు, వృద్ధులకు కూడా కాటన్ వస్త్రాలు ఉన్నాయి. ముఖ్యంగా పెద్దవారు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు చేనేత వస్త్రాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు కాటన్ వస్త్రాలు మేలు.

–సీహెచ్. జయపాల్, మంగళగిరి

రక్తహీనతపై అవగాహన అవసరం



ఫిరంగిపురం: ఎనీమియాపై ప్రజలకు అవగాహన అవసరమని డాక్టర్ శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం -3 పరిధిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 125మందికి బీపీ, షుగర్, యూరిన్ పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీరంలో రక్తకణాలు అభివృద్ధి ఆగినప్పుడు, విటమిన్స్ లోపించినప్పుడు రక్తహీనత ఏర్పడుతుందని చెప్పారు. ఇవి మూడు రకాలు మైల్డ్, మోడరేటివ్, సివియర్‌గా గుర్తించాలన్నారు. 11 గ్రాముల కన్నా తక్కువ ఉంటే మైల్డ్‌గాను, పది గ్రాములకన్నా తక్కువగా ఉంటే మోడరేటివ్, ఏడుగ్రాముల కన్నా తక్కువ ఉంటే సివియర్‌గా గుర్తించాలని చెప్పారు. రక్తహీనత గురయ్యేవారు ఆరు గ్రూపులుగా విభజించాలని వారిలో గర్భిణులు, బాలింతలు, ఆరునెలలనుండి 59నెలల పిల్లలు, ఆరునుండి 9 ఏళ్ల పిల్లలు, పదినుండి 19 ఏళ్ల వారు, 20నుండి 49 ఏళ్లలోపు వారని వివరించారు. రక్తహీనత లేకుండా ఉండాలంటే ఐరన్ ఉన్న పదార్థాలు ఆకుకూరలు, పాలు, పండ్లు, బెల్లంతోకూడిన పదార్థాలు తీసుకోవాలన్నారు. ఏడు గ్రాముల కన్నా తక్కువ ఉన్నవారికి పరీక్షచేసి ఐరన్‌సిక్రోజ్ ఇంజక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ద్వారా రక్తహీనత తొలగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భారతీ జ్యోతి, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యకు పరిష్కారం చూపండి

తాడేపల్లిరూరల్: ప్రభుత్వాలు ఎన్ని మారినా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలిసి, ఆయన ప్రారంభించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల సమస్య పరిష్కారం కోసం ముందుకు రావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. న్యాయ స్థానాలు కార్మికులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును పాలక పార్టీలు పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. ఆశీర్వాదం, ఆర్. శివ, జానీ, అంకయ్య, శారద, రమాదేవి,సారమ్మ, దుర్గాభవాని, సామ్రాజ్యం, శివమ్మ, గురవయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఆస్తి కోసం కొడుకు వేధింపులు

- రాజకీయ నాయకులు చెప్తే పట్టించుకుంటామని పోలీసుల సలహా..
- తమను రక్షించాలి అంటున్న భార్యాభర్తలు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో కన్నతండ్రిని, పెంచిన తల్లిని ఓ కసాయి కుమారుడు ఆస్తికోసం హింసించాడు. ఆ బాధలు భరించలేక మంగళవారం బాధితులు 100కు డయల్ చేయడంతో జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితులైన శ్రీనివాస్, తులసి దంపతులు కొన్ని సంవత్సరాల నుంచి రాధారంగా నగర్‌లో నివాసముంటున్నారు. 2021 నుంచి కుమారుతు త్రినాథ్‌ ఆస్తికోసం హింసిస్తున్నాడని వారు వాపోయారు. గత వారం దాడికి పాల్పడుతున్నాడని, ఇక తట్టుకోలేక తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఎవరైనా రాజకీయ నాయకులతో తమకు చెప్పించాలని పోలీసులు అంటున్నారని, ఈ వయసులో తమకు రాజకీయాలతో ఏమి సంబంధమన్నారు. పోలీసులు రాజకీయ నాయకుల దగ్గరకు ఎందుకు వెళ్లమంటున్నారో తమకు అర్థం కావడం లేదని ఆ వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న శ్రీనివాస్, తులసి దంపతులు

వేగంగా శంకర విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ, విస్తరణ పనులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలోని శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మించేందుకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరఫున చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపడుతున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారుల ఆధ్వర్యంలో హిందూ కాలేజి నుంచి ఏసీ కాలేజి వరకు ఏఈఎల్సీ, ప్రభుత్వ భవనాలు, అరండల్ పేట 2వ లైన్ నుంచి 10వ లైన్ వరకు ప్రైవేట్ భవనాలు తొలగించారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల కోసం చేపట్టిన రోడ్డు విస్తరణ పనులలో భాగంగా మొత్తం 134 ఆస్తులలో బ్రాడీపేట, అరండల్ పేటలకు సంబంధించిన 99 భవన యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని చెప్పారు. 14 ప్రభుత్వ భవనాలు, 21 మిషనరీ ఆస్తులకు రోడ్డు విస్తరణకు గాను నోటీసులు అందజేశామని తెలిపారు. పలువురు ప్రైవేట్ భవన యజమానులు, ఏఈఎల్సీ ప్రతినిధులు స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు ముందుకు వచ్చి అంగీకార పత్రాలను నగర పాలక సంస్థకు అందజేశారన్నారు. రోడ్డు విస్తరణ క్రమంలో భవనాల తొలగింపు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. విస్తరణలో మార్కింగ్ ప్రకారం వారి ఆస్తి విలువను బట్టి భవన యజమానులకు కోల్పోయిన భవనాలకు నష్టపరిహారం, స్థలం విలువకు 4 రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లను అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని, నగర అభివద్ధికి చేపడుతున్నరోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ఘనంగా మహిళా దినోత్సవం

తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్ 12వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వేడుకల్లో వందల మంది మహిళలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.అమృత రాణి జ్యోతిప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం శుభపరిణామంగా డాక్టర్ ఉమ చెప్పారు. మహిళలకు వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. నృత్యాల్లో మహిళలు సందడి చేశారు. ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ డి.జీవనలత పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో ట్రస్ట్ సభ్యులు చుండూరు వరలక్ష్మి, జి.జ్యోతికాంత్, ఎస్.లక్ష్మీఅలేఖ్య, పి.వసంత దుర్గ, టి.గాయత్రి, జి.లీలారాణి, జె.సృజన, జి.అనూరాధ, టి.జ్యోతి, ఆర్.రత్నశ్రీ, వేడుకలకు సహకరించిన వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళల సాంస్కృతిక ప్రదర్శన

గ్రంథాలయం తనిఖీ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి శాఖా గ్రంథాలయాన్ని గుంటూరు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి. సుబ్బరత్తమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నాగూర్ బాషా మాట్లాడుతూ తాడేపల్లి గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను త్వరలో పంపిణీ చేస్తామని సుబ్బరత్తమ్మ చెప్పారన్నారు.

పంచాయతీరాజ్ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



తాడికొండ: మండల పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక సోమవారం మండల పరిషత్ కార్యాలయం జరిగింది. ఏపీ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నికున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యక్షుడిగా లాం కార్యదర్శి బి.అరుణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా షేక్ మొహమ్మద్ షరీఫ్, ట్రజరర్‌గా షేక్ రెహమాన్, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.లీలా ప్రసన్న, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.మల్లేశ్వరి, పబ్లిసిటీ సెక్రటరీగా ఎస్.అనిల్, జాయింట్ సెక్రటరీగా ఎం.సౌజన్యలను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈసందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని తాడికొండ ఎంపీడీవో కె.సమతావాణి అభినందించారు.

హెల్తీ ఉమెన్ - హ్యాపీ ఉమెన్



తాడికొండ: మండలంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా హెల్తీ ఉమెన్ – హ్యాపీ ఉమెన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సి.హెచ్.కళావతి పాల్గొన్నారు. రక్తహీనత నివారణకు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తయారీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

7 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

దుగ్గిరాల: కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబు అవుతోంది. స్థానిక పసుపు మార్కెట్ యార్డు సమీపంలో గల దేవస్థానంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు వార్షికోత్సవాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 7న సుప్రభాత సేవ, ధ్వజారోహణ సేవ, నిత్య కైంకర్యాలు, గోపూజ, నిత్య హోమంతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది. 10న స్వామివారి గ్రామోత్సవం, 11న చక్రస్నానం, నిత్యహోమం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని, సాయంత్రం ధ్వజరోహణం, పవళింపు సేవలతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని భగవంతుని ఆశీస్సులు పొందాలని కోరారు.



కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

అన్ని మందులు అందుబాటులో ఉండాలి

మంగళగిరి టౌన్ : వైద్య సేవలో ఉండి ప్రజలకు, సమాజానికి సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఆటో నగర్‌లో ఉన్న ఏపీఎంఎస్ ఐడీసీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ ప్రతి జిల్లాలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నందు అన్ని మందులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య బీమా వర్తింపు, అమలుతో పాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ గిరీష, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, అన్ని జిల్లాల సూపరింటెండెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

ఉచిత విద్యుత్‌కు ‘వేసవి’ ముప్పు

- 200 యూనిట్ల లబ్ధిదారులకు తప్పని భారం
- ఒక్క యూనిట్ పెరిగినా పథకానికి అనర్హులే
- ఎస్సీ, ఎస్టీలు పొదుపు పాటించాలని యంత్రాంగం సూచన
- నానాటికీ ప్రతాపం చూపుతున్న ఉష్ణోగ్రతలు
- ఇప్పటికే పెరిగిన ఏసీలు, కూలర్‌లు, ఫ్యాన్ల వాడకం

కొల్లిపర: వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎండ వేడిమికి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాపం నుంచి తప్పించుకునేందుకు ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లను వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. మండలంలోని 20 గ్రామాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద లబ్ధిదారులకు ఇప్పటివరకు జీరో బిల్లులను అందించారు. 200 యూనిట్లు దాటితే వారికి బిల్లు భారం పడుతోంది. మండలంలో దీనికింద 4,879 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెలా సుమారు రూ.50 లక్షల విద్యుత్ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తోంది. వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగిపోవడంతో 200 యూనిట్లు దాటిన వారంతా బిల్లులు చెల్లించాల్సి వస్తోంది.

18 వేల మంది గృహ వినియోగదారులు

మండలంలోని 20 గ్రామాల పరిధిలో 18,165 విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో 4,879 మంది 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వినియోగించుకుంటున్నారు. ఫిబ్రవరి నెలలో 52 మందికి 200 యూనిట్లు దాటగా.. వారికి బిల్లు అందజేశారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు గతంతో పోల్చుకుంటే ఇంకా పెరిగే అవకాశం ఉంది. అధికంగా విద్యుత్ వినియోగించే వారి సంఖ్య రెండు, మూడు నెలల్లో మరికొంత పెరగనుంది. ఉచిత విద్యుత్ యూనిట్ల పరిమితి దాటితే బిల్లులు చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. విద్యుత్‌ను పొదుపు చేయడం ద్వారా లేదా ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో సౌర పలకలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా బిల్లు భారం తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.



కొల్లిపర మండల విద్యుత్ సబ్ స్టేషన్

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

ఎండాకాలం వేడి నుంచి తట్టుకునేందుకు ఏసీలు, కూలర్లు వినియోగిస్తారు. అవసరమున్న సమయంలో మాత్రమే వాటిని వాడుకుంటూ విద్యుత్‌ను పొదుపు చేసుకోవాలి. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్లు వరకు ఇస్తోంది. ఆ పరిమితి దాటితే బిల్లు చెల్లించాల్సి వస్తుంది.

– ప్రదీప్‌కుమార్,
విద్యుత్ శాఖ ఏఈ, కొల్లిపర మండలం

యూబీఐ సేవలను ఉపయోగించుకోండి

తెనాలి అర్బన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను అందరూ ఉపయోగించుకోవాలని ముంబయిలోని సెంట్రల్ ఆఫీస్ చీఫ్ జనరల్ మేనేజర్ బిజు వాసుదేవన్ పేర్కొన్నారు. తాడిబోయినవారి వీధిలోని బ్యాంకు కార్యాలయంలో మంగళవారం ఎంఎస్ఎంఈ మెగా అవుట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ లోన్‌లకు సంబంధించిన మంజూరు పత్రాలను ఖాతాదారులకు అందించారు. బ్యాంక్ గుంటూరు రీజియన్ హెడ్ ఎస్.జవహర్, బ్యాంకు మేనేజర్ శ్యామ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

